క్లుప్తంగా

పేద కుటుంబాలకు వితరణ



పేదలకు బియ్యం, దుప్పట్లు అందిస్తున్న ఆనందమార్గ్ ఆశ్రమ ప్రతినిధులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరా నగర్‌లోని ఆనంద మార్గ్ ఆశ్రమం బుధవారం సేవా కార్యక్రమం చేపట్టింది. 13వ వార్డు ఆరిలోవ కాలనీ జైభీం నగర్‌లో నిరాశ్రయులకు బియ్యం, దుప్పట్లు, తువ్వాళ్లు అందించింది. ఆనంద మార్గ్ విశాఖ యూనిట్ ఇన్‌చార్జి ఆచార్య సొమ్యానంద అవధూత ఆధ్వర్యంలో 20 నిరుపేద కుటుంబాలకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రతినిధులకు పేదలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధులు ఆస్ట్రేలియా ఆనంద మార్గ్ విభాగం ఇన్‌చార్జి సుధాత్మ ఆనంద్ అవధూత, ఆచార్య త్రిలోకేశానంద అవధూత, సభ్యులు ఆర్.ఎ.పాత్రో పాల్గొన్నారు.

నవంబర్ 9న లేడీస్ పిక్నిక్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

బీచ్‌రోడ్డు: మహిళలకు ఒక రోజు పూర్తిగా కేటాయిస్తూ ప్రతి ఏటా నిర్వహించే లేడీస్ పిక్నిక్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం నగరంలోని ఒక హోటల్‌లో జరిగింది. వైజాగ్ ఉమెన్ ఫోరం, ఉమెన్ కాంటెస్ట్–ఈవెంట్స్, వైజాగ్ యాక్టివ్ ఉమెన్, వీరు మామ సంయుక్తంగా నవంబర్ 9న లేడీస్ పిక్నిక్ నిర్వహించనున్నట్లు వీరుమామ తెలిపారు. 20 ఆటలు, 500 బహుమతులు, విందు కార్యక్రమాలతో అలరించనున్నామని పేర్కొన్నారు. లేడీస్ పిక్నిక్ కార్నివాల్ తొలి పోస్టర్‌ను వైజాగ్ అందాల పోటీల విజేతలు సునీల, సాక్షి బజాజ్, పద్మిని, వర్ధిని, చిహ్మికా, సంధ్యా చౌదరి, మమతా చౌదరి, రజిని, శైలజ, దీపిక, హీరోయిన్ రేఖా భోజ్ ఆవిష్కరించారు.

ఫార్మసిస్టుల ర్యాలీ



బీచ్ రోడ్డులో అవగాహన ర్యాలీ చేస్తున్న ఫార్మసిస్టులు, స్టూడెంట్లు

మద్దిలపాలెం: ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా ఫార్మ స్టూడెంట్‌ల ఆధ్వర్యంలో బుధవారం బీచ్ రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. హోటల్ పామ్ బీచ్ నుంచి ఆర్కే బీచ్ వరకూ ర్యాలీ కొనసాగింది. ఏయూ అనుబంధ ఫార్మసీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీని రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిషోర్‌బాబు జెండా ఊపి ప్రారంభించారు. కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, దాని అనుబంధ కళాశాలల నుంచి సుమారు 450 మంది విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.గిరిజా శంకర్, అధ్యాపకులు, పరిశోధనా విద్యార్థులు ర్యాలీ చేశారు.

సాగర్‌నగర్‌లో కొండచిలువ కలకలం



కొండచిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్ కిరణ్

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్ నగర్‌లోని హర్ష టవర్స్ వద్ద బుధవారం భారీ కొండచిలువ హల్‌చల్ చేసింది. ఈ టవర్స్ ప్లేగ్రౌండ్ వద్ద ఉన్న వలలో ఈ కొండచిలువ చిక్కుకుని పోయింది. దీనిని గమనించిన నివాసితులు వెంటనే స్నేక్ సేవర్ సొసైటీకి చెందిన కిరణ్ కుమార్‌కు సమాచారం అందజేశారు. అక్కడికి చేరుకున్న కిరణ్ కొండచిలువను జనాలు లేని చోట వదిలిపెట్టాడు. పాములు కనిపిస్తే ఎవరూ చంపవద్దని, తమకు సమాచారం అందించాలని తెలిపారు.

మందకొడిగా బీసీజీ వ్యాక్సినేషన్



పాత వెంకోజీపాలెం యూపీహెచ్‌సీ వద్ద బీసీజీ టీకా వేస్తున్న ఏఎన్ఎం

- టీకా వేసుకునేందుకు వృద్ధుల నిరాసక్తత
- ఆశించిన స్థాయిలో రాని ఫలితాలు
- అవగాహన కల్పించడంలో అధికారుల వైఫల్యం
- రెండు నెలలుగా సా...గుతున్న ప్రక్రియ

మద్దిలపాలెం: క్షయ వ్యాధి(టీబీ) నివారణ కోసం చేపట్టిన బీసీజీ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. రెండు నెలలుగా మందకొండిగా.. మొక్కుబడిగా కొనసా...గుతూనే ఉంది. 60 ఏళ్ల వయసు దాటిన వారికి టీబీ సోకే ప్రమాదం ఎక్కువగా ఉందనే వైద్య నిపుణుల హెచ్చరికలతో అప్రమత్తమైన వైద్య ఆరోగ్య శాఖ.. వ్యాక్సినేషన్‌పై దృష్టి సారించింది. అందుకు తగ్గట్టుగా ప్రజలకు దీనిపై అవగాహన కల్పించడంలో ఘోరంగా విఫలమైంది. దీంతో ప్రజల్లో అనేక అపోహలు తలెత్తాయి.

సచివాలయ స్థాయిలోనే..

బీసీజీ వ్యాక్సినేషన్‌పై సమగ్రంగా అవగాహన కల్పించేలా పోస్టర్లు, కరపత్రాల పంపిణీ, అన్ని ప్రాంతాల్లో వీడియోల ద్వారా అవగాహన కల్పించి ఉంటే దీని లక్ష్యం సులువుగా సాధించడానికి వీలు పడేదని పలువురు పేర్కొంటున్నారు. కేవలం క్షేత్రస్థాయిలో మాత్రమే సచివాలయాల పరిధిలో నిర్వహించిన సమగ్ర సర్వేలో గుర్తించిన 60 ఏళ్లు దాటిన వారందరికీ బీసీజీ వ్యాక్సినేషన్ వేయాలనే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోకి వచ్చే పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(యూపీహెచ్‌సీ)ల్లో ప్రస్తుతం ఈ కార్యక్రమం రెండు నెలలుగా నెమ్మదిగా సాగుతోంది. సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకొని ప్రతి సోమ, గురువారాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి బీసీజీ టీకా వేస్తున్నారు.

లక్ష్య సాధనకు కుస్తీ..

60 ఏళ్లు దాటిన వారికి బీసీజీ టీకా వేయాలని వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఆదేశించినా.. క్షేత్రస్థాయిలో సరైన స్పందన లభించడం లేదు. పాత వెంకోజీపాలెం, ఇసుకతోట, పిఠాపురం కాలనీ యూపీహెచ్‌సీల పరిధిలో సుమారుగా 18 వేల మందికి టీకా వేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు కేవలం 5 వేల మందికి వేశారని తెలుస్తోంది. నియోజకవర్గంలోని మిగతా ఆరోగ్య కేంద్రాల పరిధిలో పరిస్థితి మరీ దారుణంగా ఉన్నట్లు తెలుస్తోంది. నిన్న మొన్నటి వరకు సచివాలయాల్లో మాత్రమే టీకా వేసేవారు. ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో క్యారియర్ చేతపట్టుకొని, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు(ఏఎన్ఎం), ఆశ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి వ్యాక్సిన్ వేస్తున్నారు. ప్రజలు టీకా వేసుకునేందుకు ముందుకు రాకపోవడంతో పురోగతి కనిపించడం లేదు. దీంతో లక్ష్య సాధనకు వైద్య సిబ్బంది కుస్తీ పడుతున్నారు.



హెచ్‌బీ కాలనీలో ఇంటి వద్ద వ్యాక్సిన్ వేస్తున్న ఏఎన్ఎం, సిబ్బంది

ప్రచారం అంతంత మాత్రమే..

క్షయ వ్యాధి నివారణకు ఉచితంగానే టీకా వేస్తున్నప్పటికీ.. దీనిపై ప్రజల్లో అనేక అపోహలు ఉన్నాయి. బీసీజీ వ్యాక్సిన్ ద్వారా చేకూరే ప్రయోజనాలపై ప్రచార మాధ్యమాలు, కరపత్రాలు, పోస్టర్లు, ఇతర ప్రచారాలు చేయకపోవడమే ఇందుకు కారణం. టీకా వేసుకున్న వారి చేతికి పుండు రావడం, నీరసంగా ఉండటంతో దీనిపై నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు. కరోనా టీకా మాదిరే స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు టార్గెట్‌లు పెడుతుండటంతో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. వ్యాక్సినేషన్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇలా అయితే టీబీ వ్యాధికి అడ్డుకట్ట వేయడం కష్టమేనని వైద్య నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో బీసీజీ వ్యాక్సినేషన్ ప్రక్రియపై విస్తృత ప్రచారానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

టీకా వేసుకుంటేనే మేలు



టీబీ వ్యాధి సోకకుండా అర్హులైన వారు బీసీజీ టీకా వేసుకోవాలి. వ్యాక్సిన్ వేసుకున్న వారి చేతికి పుండు వస్తున్నా, ఇది నెల రోజుల్లో మానిపోతుంది. అలా రావడం కూడా మందు పనిచేస్తున్నట్లు గానే భావించాలి. మా యూపీహెచ్‌సీ పరిధిలో లక్ష్యసాధనకు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నాం. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఇంటింటికీ వెళ్లి అర్హులకు టీకాలు వేస్తున్నారు. వైద్య సిబ్బందికి సహకరించాలి.

– డాక్టర్ రెహనిషా, వైద్యాధికారి, పాత వెంకోజీపాలెం యూపీహెచ్‌సీ

సిటీ డయాగ్నస్టిక్ సెంటర్ సిద్ధం



విమ్స్ ఆవరణలో నిర్మించిన రీజినల్ డ్రగ్ స్టోర్స్, సిటీ డయాగ్నస్టిక్ సెంటర్ భవనం

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో రీజినల్ డ్రగ్ స్టోర్స్, సిటీ డయాగ్నస్టిక్ సెంటర్ సిద్ధమైంది. 2022 అక్టోబర్‌లో చేట్టిన దీని నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. త్వరలో వీటిని వైద్య శాఖాధికారులు అందుబాటులోకి తీసుకురానున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇక్కడ సుమారు అరెకరం స్థలంలో రూ.20 కోట్లతో డయాగ్నస్టిక్ సెంటర్ నిర్మాణం చేపట్టింది. ఇది ప్రారంభమైతే ప్రజలకు ఆధునిక పద్ధతిలో తక్కువ ధరలకు అన్ని రకాల పరీక్షలు అందాటులోకి రానున్నాయి. అవసరమైన పనిముట్లు, యంత్రాలు, ఎక్విప్‌మెంట్ తీసుకువచ్చి అమర్చాల్సి ఉంది. ప్రైవేట్ ల్యాబ్‌లో రక్త పరీక్షలు, సీటీ స్కాన్, ఎం.ఆర్.ఐ., ఎక్స్‌రేలు తీయడానికి రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ ల్యాబ్‌ల వల్ల రోగులకు కొంతమేర వైద్య ఖర్చులు తగ్గనున్నాయి.

రీజినల్ డ్రగ్ స్టోర్స్ ఏర్పాటు..

నాలుగు జిల్లాలకు కేంద్రంగా విమ్స్ ఆవరణలో రీజినల్ డ్రగ్ స్టోర్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖతోపాటు శ్రీకాకుళం, విజయనగరం, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో ప్రభుత్వ ఆస్పత్రులకు ఇది కేంద్రంగా మారనుంది. సిటీ డయాగ్నస్టిక్ సెంటర్ రేడియోలజీ విభాగంలో సి.టి.స్కాన్, ఎం.ఆర్.ఐ, యూఎస్‌జీ రూంలు, రేడియోలజీ ఎక్స్‌రే రూంలు, సాంపిల్ కలెక్షన్ రూంలు, డాక్టర్ చాంబర్లు, వైరాలజీ ల్యాబ్(బీఎస్ఎల్–2 లెవెల్స్), మైక్రో బయోలజీ, పాథాలజీ ల్యాబ్స్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, బయోకెమిస్ట్రీ ల్యాబ్, సెంట్రల్ రీసెర్చ్ ల్యాబ్స్ సిద్ధం చేస్తున్నారు. డ్రగ్ స్టోర్‌లో ఫార్మాసిస్టులు, డాక్టర్లు, ప్రత్యేక గదులు,బయో మెడికల్ ఇంజినీర్ రూం, వర్క్ షాప్, కంప్యూటర్ రూం, ఎలక్ట్రికల్ రూం, ఆఫీస్ ఏరియా, సాంపిల్ రూం, వాక్ ఇన్ కోల్డ్ రూం, ప్యాకింగ్ ఏరియా, కోల్డ్ స్టోరేజ్–1, 2 ఉంటాయి.

మహా ధర్నాను జయప్రదం చేయండి

ఆరిలోవ: కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పిలుపునిచ్చారు. ఇందిరాగాంధీ జూ పార్కు ప్రధాన ద్వారం వద్ద జూ కార్మికులతో కలిసి బుధవారం మహా ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ తదితర కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, అంతవరకు కనీస వేతనం రూ.26 వేలకు తక్కువ కాకుండా ఇవ్వాలనే డిమాండ్లతో ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో జరగనున్న ఈ ధర్నాలో జిల్లాలో కార్మికులంతా కలిసికట్టుగా పాల్గొనాలని కోరారు. జూ పార్కులో సుమారు 20 ఏళ్లకు పైగా పనిచేస్తున్న కార్మికులకు చాలీచాలని వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. వీరికి కనీస వేతనాలతోపాటు వారాంతపు, పండగ సెలువులు కూడా లేవన్నారు. అన్ని సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న ఇటువంటి సమస్యలపై మహాధర్నాలో సీఐటీయూ నాయకులు గళమెత్తుతారని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, జూ కార్మికులు పాల్గొన్నారు.



జూ గేటు వద్ద ధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేత కుమార్, కార్మికులు

రెండు ఆస్పత్రుల్లో డీఎంహెచ్‌వో తనిఖీలు



రెయిన్‌బో ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి. జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం బుధవారం హెల్త్ సిటీలో గల రెయిన్‌బో, స్టార్ పినాకిల్ ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడి అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు రిజిస్ట్రేషన్ ఉన్నదీ లేనిదీ తనిఖీ చేశారు. ఫారం–ఎఫ్ ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తున్నారో లేదో పరిశీలించారు. 5 శాతం ఉచిత స్కానింగ్‌లు చేస్తున్నదీ లేనిదీ ఆరా తీశారు. 5 శాతం ఉచిత స్కాన్నింగ్‌కు విడిగా రిజిస్టర్ నిర్వహించాలని, గర్భస్త పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని తెలిపే సైన్‌బోర్డు ప్రతి స్కానింగ్ సెంటర్‌లో ఉండాలన్నారు. గైనకాలజిస్ట్, రేడియాలజిస్ట్ తప్పనిసరిగా ఉండాలని, డాక్టర్ల అర్హత సర్టిఫికెట్లు స్కానింగ్ సెంటర్లలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రతి ఒక్క ఏఎన్ఎం వ్యాక్సినేషన్ రోజున ముందుగా లబ్ధిదారుల జాబితా దగ్గర పెట్టుకోవాలని, ఆ జాబితా ప్రకారం వ్యాక్సిన్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పరిసరాలు క్లోరినేషన్ చేయాలని, మంచి నీరు లేదా కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమలు, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, మురుగు కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించుకోవాలని, దోమ తెరలు వాడాలని ప్రజలకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ మోహనరావు



హాజరైన విద్యార్థులు

మహారాణిపేట: భవిష్యత్తును నాశనం చేసే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.మోహన్‌రావు అన్నారు. బుధవారం ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మహిళా జూనియర్ కాలేజీలో సెట్విస్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం, మహిళల అక్రమ రవాణా, సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఒక వ్యక్తి చెడు వ్యవసాలకు అలవాటు పడితే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు ఎప్పటికప్పుడు వారిని గమనించాలన్నారు. ఏఎస్ రాజా మహిళా జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కాసు మాట్లాడుతూ చెడు వ్యవసనాలకు అందరూ దూరంగా ఉండాలని, సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విస్ మేనేజర్ ఎస్.వెంకటేష్, జూనియర్ కాలేజీ అధ్యాపకులు జి.వర లక్ష్మి, ఎం.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల దుష్ఫలితాలపై అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా అధికారి విజయకుమార్ తదితరులు

మహారాణిపేట: మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ఫలితాలు తెలిపే కరపత్రాలను బుధవారం పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఉమ్మడి విశాఖ జిల్లా ఔషధ నియంత్రణ అధికారి ఎస్.విజయకుమార్ ఆవిష్కరించారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రాష్ట్ర ఔషధ నియంత్రణ పరిపాలనా శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి.లక్ష్మి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, మత్తు మందుల నివారణ, వాటి వల్ల కలిగే దుష్ఫలితాలను కరపత్రాలు, పోస్టర్ల ద్వారా విద్యార్థులకు అవగాహన కలిగించనున్నారు.

ప్రపంచ ఫార్మసిస్ట్ డే సందర్భంగా పలువురు ఫార్మసిస్టులను సత్కరించారు. పెందుర్తి కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, పెందుర్తి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కె.కల్యాణి, ఎం.శ్రీనివాసరావు, ఎస్.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో ఉదయం స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపజేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం, అక్షింతలు అందజేశారు. అర్చకుడు కుమారాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

రేపటి నుంచి బాలబాలికలకు ఆటల పోటీలు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలోని పాఠశాలల విద్యార్థులకు తోటగరువు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ నెల 27 నుంచి 30 వరకు ఆటలు పోటీలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ తెలిపారు. జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ప్రభుత్వ, సర్కారు గుర్తింపు పొందిన ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న 14 నుంచి 17 ఏళ్ల వయసు గల బాలబాలికలు ఈ పోటీలకు అర్హులన్నారు. రోజూ ఉదయం 8.30 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు సమయానికి విద్యార్థులను తీసుకొని పోటీలకు హాజరు కావాలని హెచ్ఎం కోరారు.

శివాలయం హుండీ చోరీ

బీచ్‌రోడ్డు: చినవాల్తేరు కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శివాలయం హుండీ చోరీకి గురైనట్లు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం ఆలయం తెరిచే సరికి హుండీ కనిపించ లేదు. దీంతో దేవాలయం పూజారి దేవదాయ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు చేసిన ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్‌లోని దుర్గామల్లేశ్వరి ఆలయ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను బుధవారం ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వచ్చే నెల 3 నుంచి 12 వరకు ఉత్సవాలు జరగనున్నాయని ఆలయ అధ్యక్షుడు మార్గాన వెంకటేశ్వర రావు తెలిపారు. 3న అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపుతోపాటు బాలత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. 4న గాయత్రి దేవిగా, 5న అన్నపూర్ణ దేవిగా, 6న లలితా త్రిపుర సుందరీ దేవిగా, 7న మహా చండీ దేవిగా, 8న మహాలక్ష్మీ దేవిగా, 9న సరస్వతీ దేవిగా, 10న కనక దుర్గాదేవిగా, 11న మహిషాసుర మర్ధని దేవిగా, 12న రాజ రాజేశ్వరిదేవిగా అమ్మవారిని అలంకరించి శరన్నవ రాత్రి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సీపీకి కమిటీ సభ్యులు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంఘ కన్వీనర్ రాజు గౌడ్, నక్కిలి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

12, 13 వార్డుల్లో సమస్యలు పరిష్కరించండి

ఆరిలోవ: జీవీఎంసీ 12, 13 వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఆరిలోవ ప్రాంత కార్పొరేటర్లు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. 12వ వార్డులోని ఎక్కువ ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగడం లేదని, దీంతో స్థానికులు రాత్రిళ్లు చీకటిలో ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ అక్కరమాని రోహిణి తెలిపారు. పెద గదిలి నుంచి తోటగరువు, అంబేడ్కర్ కూడలి మీదుగా పార్వతీనగర్ వరకు మధ్యలో నిలిచిపోయిన రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. వార్డులో క్రాంతినగర్, పోలీస్ స్టేషన్ వెనుక సామాజిక భవనాల నిర్మాణాలు మధ్యలో నిలిపోయాయని, అవి పూర్తి చేయాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. 13వ వార్డులో కూడా వీధి దీపాలు వెలగకపోవడం, కుక్కల బెడద, పారిశుధ్య లోపం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో రక్షణ గోడ నిర్మాణం తదితర సమస్యల గురించి కార్పొరేటర్ కెల్ల సునీత కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు.

‘ఇది మంచి ప్రభుత్వం’కు స్పందన కరువు

- సచివాలయం సిబ్బందితోనే మమా.. అనిపిస్తున్న టీడీపీ నాయకులు



10వ వార్డు నాగేశ్వరరావు పేటలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న బయట ప్రాంతం సచివాలయాల సిబ్బంది

ఆరిలోవ: టీడీపీ నాయకులు చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి స్పందన కరువైంది. కూటమి ప్రభుత్వం ఏమీ చేయకపోవడంతో ప్రజల నుంచి సహకారం లేదు సరికదా ఆ పార్టీ నాయకులు కూడా జనానికి ముఖం చూపించుకోలేక దుమ్మా కొడుతున్నారు. దీంతో సచివాలయాల సిబ్బందితోనే ఈ కార్యక్రమాన్ని మమా అనిపిస్తున్నారు. నియోజకవర్గంలోని 10వ వార్డులో పూర్తిగా సచివాలయాల సిబ్బందిపైనే టీడీపీ నాయకులు ఆధారపడ్డారు. ఏ ప్రాంతంలో కార్యక్రమం జరిగినా అన్ని సచివాయాల నుంచి సిబ్బంది పాల్గొనాలని హుకుం జారీ చేస్తున్నారు. సెలవు పెట్టినవారు సైతం రావాల్సిందేనని, లేదంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సంగతి తేలుస్తామంటూ బెదిరిస్తున్నారని సిబ్బంది వాపోతున్నారు.

షాడో కార్పొరేటర్ బెదిరింపులు..!

జీవీఎంసీ 10వ వార్డులో మద్దిల రామలక్ష్మి కార్పొరేటర్(టీడీపీ)గా ఉన్నారు. ఆమె భర్త వార్డులో షాడో కార్పొరేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎటువంటి అధికారం లేకపోయినప్పటికీ ఆయనే సచివాలయ సిబ్బందితో అనధికారికంగా సమావేశాలు పెట్టడం, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనకపోతే ఇబ్బంది పడతారంటూ బెదిరించడం వంటివి చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజానికి వార్డులోని ఏ ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన కార్యక్రమం చేపడితే అక్కడి సచివాలయం సిబ్బంది మాత్రమే పాల్గొంటారు. ఈ వార్డులో మాత్రం ఎక్కడ కార్యక్రమం చేపట్టినా.. అన్ని సచివాలయాల నుంచి సిబ్బందిని ఒత్తిడి చేసి తీసుకుపోతున్నారు.

సచివాలయాల సిబ్బంది ఆవేదన

సాధారణంగా వార్డు సచివాలయాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయి. ఆ సమయంలో మాత్రమే సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం వల్ల అన్ని సచివాలయాల్లో ఉన్న 42 మంది సిబ్బంది ప్రతి రోజూ ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సి వస్తోంది. అనంతరం సచివాలయం సమయానికి వెళ్లి విధుల్లో పాల్గొంటున్నారు. మళ్లీ సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు వారిని ఉపయోగించుకుంటున్నారు. దీంతో సాయంత్రం 5 గంటలకు మూయాల్సిన సచివాలయాలు గంట ముందుగానే రోజూ మూతపడుతున్నాయి. అసలు వీరిని ఎందుకు వినియోగిస్తున్నారంటే.. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి టీడీపీ నాయకులు ఎక్కువ మంది దుమ్మా కొడుతున్నారు. దీంతో జనం లేక చులకనయిపోతున్నామనే భయంతో వార్డులో ఎక్కడ జరిగిన కార్యక్రమానికైనా అన్ని సచివాలయాల నుంచి సిబ్బంది భయపెట్టి తీసుకుపోతున్నారు. దీనిపై ఇదేం కర్మ అంటూ సచివాలయం సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏయూలో ఆచార్య సచ్చిదానందమూర్తి శత జయంతి



ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏయూ ఆచార్యులు

మద్దిలపాలెం: ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి శత జయంతి వేడుకలు బుధవారం ఏయూలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపన్యాసకుడిగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య పి.జార్జ్ విక్టర్ ప్రసంగించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వన్నెతెచ్చిన కొద్దిమందిలో ఆచార్య సచ్చిదానందమూర్తి ఒకరిని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.